విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్

వినియోగదారులు సులభంగా చెల్లించేలా విద్యుత్ శాఖ ఏర్పాట్లు

సిటీబ్యూరో, జూలై 5 (నమస్తే తెలంగాణ): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నెల నెలా జారీ చేసే విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించనుంది. వినియోగదారులు తమ మొబైల్ ఫోన్ ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ బిల్లులను సులభంగా చెల్లించవచ్చు. క్యూఆర్ కోడ్‌తో కూడిన బిల్లులు వచ్చే నెల నుంచి వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి. ఆర్‌బీఐ కొత్త నిబంధనల వల్ల కొన్ని థర్డ్ పార్టీ యాప్స్‌లో నేరుగా బిల్లులు చెల్లించే సదుపాయాన్ని ఇటీవల తొలగించారు. ఈ నేపథ్యంలోవిద్యుత్ శాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. కాగా ఈ నెల నుంచి థర్డ్ పార్టీ యాప్స్‌లో నేరుగా బిల్లులు చెల్లించే అవకాశం లేకున్నా, ప్రస్తుతానికి బిల్లు వసూళ్లపై ప్రభావం పడలేదని అధికారులు తెలిపారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో బిల్లులు జారీ కావడంతో ఇప్పటి వరకు మొత్తం 1.20 లక్షల మంది వినియోగదారులు బిల్లులు చెల్లించారని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థ వెబ్‌సైట్, మొబైల్ యాప్ నుంచి బిల్ డెస్క్, పీజీఐ(పేమెంట్ గేట్‌వే ఆఫ్ ఇండియా), పేటీఎం, టీఎ వ్యాలెట్, టీజీ/ఏపీ ఆన్‌లైన్, మీసేవ, టీ వ్యాలెట్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చు. గ్రేటర్ పరిధిలోని 10 సర్కిళ్లలో ఉన్న విద్యుత్ వినియోగదారుల కోసం ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లలో ఇప్పటికే ఎస్టిమేషన్ పేమెంట్స్, ఇతర బిల్లుల చెల్లింపుల్లో క్యూఆర్ కోడ్ ఆధారిత పేమెంట్స్ జరుగుతున్నామని అధికారులు తెలిపారు.

నేడే జీహెచ్ఎంసీ కౌన్సిల్!

- అస్త్రశస్త్రాలతో సిద్ధమైన ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్లు
- ఏడు నెలల పాలన వైఫల్యాలను ఎండగట్టనున్న బీఆర్ఎస్
- మేయర్ రాజీనామా, అభివృద్ధి, ఆరు గ్యారంటీల అమలుపై పట్టు
- అధికార పార్టీ కంటే బలంగా ఉన్న ప్రతిపక్షాలు
- సమావేశానికి గ్రేటర్ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు హాజరు

సిటీబ్యూరో, జూలై 5 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశానికి సర్వం సిద్ధమైంది. మరికొద్ది గంటల్లో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరగనుంది. దాదాపు నాలుగున్నర నెలల తర్వాత జరుగుతున్న ఈ సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అన్ని పార్టీలకు సంబంధించి 23 ప్రశ్నలతో సుదీర్ఘంగా చర్చ సాగేలా సభ సన్నద్ధమైంది. అయితే ఈ సభ ప్రత్యేకతను సంతరించుకున్నది. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కావడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కావాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. పార్టీ మారిన

మేయర్ రాజీనామా డిమాండ్, అభివృద్ధి, ఆరు గ్యారంటీల అమలు ఎజెండాగా బీఆర్ఎస్ ముక్త కంఠంతో ప్రశ్నించేందుకు సిద్ధమైంది. ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో గ్రేటర్ అభివృద్ధి కుంటుపడటం, స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి శాఖ అయిన జీహెచ్ఎంసీపై ఏనాడూ సమీక్షించకపోవడం, గత బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోవడం, పారిశుధ్యం పడకేయడం, దోమలతో డెంగ్యూ వ్యాధుల విజృంభణ, నాలా సమస్యలు, అక్రమ నిర్మాణాలను ఎండగట్టేందుకు ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్లు సిద్ధంగా ఉండటంతో సభ సజావుగా సాగుతుందా? సమర్థవంతంగా నిర్వహించలేక మేయర్ చేతులెత్తేస్తారా? అన్నది వేచి చూడాలి.

అధికార పార్టీ కంటే బలంగా ఉన్న ప్రతిపక్షాలు..

సభలో విచిత్ర పరిస్థితి నెలకొంది. గడిచిన కొన్ని నెలలుగా జంపింగ్ జపాంగ్‌లు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులతో నేటికీ బీఆర్ఎస్ మాత్రమే బలంగా ఉంది. 150 మంది కార్పొరేటర్లలో ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా కాగా, మరో ఇద్దరు ఎర్రగడ్డ, గుడిమల్కాపూర్ కార్పొరేటర్లు చనిపోయారు. ప్రస్తుతం బీఆర్ఎస్ కార్పొరేటర్లు 47 మందితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. ఇక ఎంఐఎం 41, బీజేపీ 39, కాంగ్రెస్ 19 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు.

మేయర్ రోల్‌పై ఆసక్తి..

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలిచాక మేయర్ అయ్యారు. అప్పుడు రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆమె కాంగ్రెస్‌లో చేరారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మేయర్ కన్నా ముందే కాంగ్రెస్‌లో చేరారు. కొందరు కార్పొరేటర్లు సైతం తామున్న పార్టీల నుంచి ఇతర పార్టీల్లోకి మారారు. జీహెచ్ఎంసీ చట్టం, నిబంధనల మేరకు ఎవరు ఏ పార్టీలోకి వెళ్లినా ఎలాంటి సమస్యలుండవు. ఎలాంటి అవిశ్వాసానికి తావు లేదు. విజయలక్ష్మి మేయర్ అయ్యేటప్పుడు బీఆర్ఎస్ పార్టీకున్న కార్పొరేటర్ల బలం వల్ల ఆమె మేయర్ అయ్యారు. ఇప్పటికీ జీహెచ్ఎంసీలో మిగతా పార్టీల కంటే బీఆర్ఎస్ కార్పొరేటర్లే అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే అప్పట్లో బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు లేవనెత్తే వివిధ అంశాలపై బీఆర్ఎస్ సభ్యులు మూకుమ్మడిగా స్పందించేవారు. మేయర్ సైతం బీఆర్ఎస్ కావడంతో సభ అనుకూలంగా నడిచేది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ల సంఖ్య రెండు నుంచి దాదాపు ఇరవైకి చేరువైనప్పటికీ, మిగతా పార్టీల సభ్యుల కంటే తక్కువ. గతంలో అభివృద్ధి కార్యక్రమాల గురించి చెబుతూ విమర్శలను తిప్పకొట్టిన బీఆర్ఎస్ సభ్యులు.. ఇప్పుడు వివిధ సమస్యలను ప్రస్తావించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో మేయర్ ఎలా వ్యవహరిస్తుందోనని ఉత్కంఠ నెలకొంది. కాగా జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలికి ఇది తొలి సమావేశం.

సమస్యలపై ప్రశ్నిద్దాం: బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

ప్రజా సమస్యలు, నగరంలో చేపట్ట వలసిన అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ సమావేశంలో ముక్త కంఠంతో ప్రశ్నించాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు , కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం జరగనున్న నేపథ్యంలో శుక్రవారం తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్ల సమావేశంలో కౌన్సిల్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 7 నెలలు దాటినా నేటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మహిళలకు రూ.2500 ఆర్థిక సహాయం, రూ.4వేల పెన్షన్ పెంపు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం పంపిణీ, డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం, సంక్షేమ కార్యక్రమాలు ఇంత వరకు అమలుకు నోచుకోకపోవడంపై ప్రధానంగా చర్చించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన అనేక అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని, ఇది సరైన విధానం కాదని సమావేశంలో పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణ కూడా సక్రమంగా లేదని, ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి ఉన్నాయని, ప్రజలు రోగాల భారిన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలాల్లో పూడిక తొలగింపు పనులు కూడా చేపట్టడం లేదని తెలిపారు. తమను గెలిపించిన ప్రజల పక్షాన ఈ అంశాలన్నింటిపై జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, సుధీర్‌రెడ్డి, ప్రకాశ్ గౌడ్, కాలేరు వెంకటేశ్, మాజీ మంత్రి మహమూద్ అలీ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రజాపరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ గౌతమ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ పాల కవర్గం పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో దిలీప్ కలెక్టర్‌కు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

– మేడ్చల్, జూలై 5(నమస్తే తెలంగాణ)

7న జగన్నాథ రథయాత్ర..

హిమాయత్‌నగర్, జూలై 5: ఈ నెల 7న మధ్యాహ్నం 2:30 గంటలకు నిజాంపేటలోని మైసమ్మ ఆలయం నుంచి శ్రీజగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్నట్లు కూకట్‌పల్లి ఇస్కాన్ సంస్థ అధ్యక్షుడు మహా శృంగదాస, రథయాత్ర కమిటీ చైర్మన్ అంజనీకుమార్ అగర్వాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ రథయాత్ర కూకట్‌పల్లి జేఎన్‌టీయూ, వివేకానంద విగ్రహం మెయిన్ రోడ్డు, హుడా ట్రక్ పార్కింగ్ వరకు జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రతినిధులు మనీష్ ఆగర్వాల్, పురుషోత్తమ్ అగర్వాల్, ఓక్సనా, దేవరూప దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ గ్రౌండ్‌లో..

సుల్తాన్‌బజార్ : ఈ నెల 7న జగన్నాథ రథయాత్రను ఘనంగా నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ టెంపుల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు వేదాంత చైతన్య దాస్‌తో పాటు హెచ్‌టీఎంసీ కన్వీనర్ వరద కృష్ణదాస్, కార్యదర్శి, జనరల్ మేనేజర్ శంభు వైష్ణవ దాస్ తెలిపారు. శుక్రవారం అబిడ్స్‌లోని రాధామదన మోహన టెంపుల్ ఇస్కాన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ .. 7న ఎన్టీఆర్ స్టేడియంలో ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రథయాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ యాత్ర ఎన్టీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమై ఆర్టీసీ ఎక్స్ రోడ్, చిక్కడపల్లి, నారాయణ గూడ చౌరస్తా, వైఎంసీఏ, హిమాయత్ నగర్ చౌరస్తా, టీటీడీ టెంపుల్, లిబర్టీ ఎక్స్ రోడ్, బషీర్‌బాగ్ ఎక్స్‌రోడ్ తదితర ప్రాంతాల మీదుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు కొనసాగుతుందని తెలిపారు.

యునెస్కో ప్రాజెక్టుకు ఎంపికైన హెచ్‌సీయూ ప్రొఫెసర్

ప్రమోద్ కే నాయర్

కొండాపూర్, జూలై 5 : హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగంలోని స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ ప్రొఫెసర్ ప్రమోద్ కే నాయర్ యునెస్కో ప్రాజెక్ట్ 'గ్రీనింగ్ విత్ సైన్స్, ఇన్నోవేషన్ మరియు టెక్నాలజీ'కి సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ ప్రాజెక్ట్ యునెస్కో ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ హైయర్ ఎడ్యుకేషన్ ఇన్ లాటిన్ అమెరికా అండ్ ది కరేబియన్ యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ సౌత్ -సౌత్ కో ఆపరేషన్స్‌లతో కలిసి నిర్వహిస్తుంది. 4 వారాల పాటు కొనసాగే ఈ పైలెట్ ప్రాజెక్ట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా యువత, విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సవాళ్లు, మార్గదర్శకత్వం అందించేందుకు ప్రయత్నిస్తుంది. యునెస్కో గ్లోబల్ సౌత్ రీజియన్ల నుంచి 11 ప్రముఖ విశ్వవిద్యాలయాలు, సభ్య విశ్వవిద్యాలయాలను అవుట్‌పుట్‌గా ప్రాజెక్ట్‌లో భాగస్వాములవుతారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో వర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ సభ్యుడిగా ఎన్నికవడంపై యాజమాన్యం అభినందనలు తెలిపింది.

రేపటి నుంచే మహంకాళి బోనాల ఘటోత్సవాలు

జూలై 21న బోనాలు, 22న రంగం వేడుకలు

ముస్తాబవుతున్న మహంకాళి ఆలయం : ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, కమిటీ సభ్యులు

బేగంపేట్, జూలై 5: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతరలో భాగంగా ప్రధాన ఘట్టమైన ఘటోత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి ఘటోత్సవాల వివరాలు వెల్లడించారు.ఈ నెల 7న ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు దేవాలయం నుంచి భాజా భజంత్రీలు, పసుపు కుంకుమలతో అమ్మవారి విగ్రహాన్ని కర్బలా మైదాన్ వద్దకు తీసుకెళ్లి అక్కడ ఘటం తయారు చేస్తారని తెలిపారు. సాయంత్రం 7 గంటలకు కర్బలా మైదాన్ నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఘటాన్ని దేవాలయానికి తీసుకువస్తారన్నారు. అనంతరం పదిహేను రోజులు అమ్మవారి బోనాలు, రంగం వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.దేవాలయానికి రాలేని భక్తుల కోసం అమ్మవారినే ఇంటింటికీ పంపించడమే ఈ ఘటోత్సవ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ సభ్యులు సురిటి కామేశ్, నూతన ధర్మకర్తలు విశాల్‌సుదం, కటారి మహేశ్, శ్రీకాంత్ చారి పాల్గొన్నారు.

ఘటోత్సవం తిరిగే ప్రాంతాలు..

- 7న ఆదివారం ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి ఘటం మధ్యాహ్నం 2 గంటలకు దేవాలయం నుంచి బయలుదేరి కర్బలా మైదానంలో అలంకరణ పూర్తి చేసుకొని రాత్రి 10 గంటలకు దేవాలయానికి చేరుకుంటుంది.
- 8న సోమవారం హిమంబావి, డొక్కలమ్మ దేవాలయం ప్రాంతాల్లో ఊరేగిస్తారు.
- 9న కళాసీగూడ, 10న నల్లగుట్ట, 11న పాన్‌బజార్, 12న ఓల్డ్ బోయిగూడ, 13న రంగ్‌రేజీ బజార్, 14న చిలకలగూడ, 15న ఉప్పర బస్తీ, 16న కుమ్మరిగూడ, 17న రెజిమెంటల్‌బజార్, 18న ఘటం దేవాలయంలోనే ఉంటుంది. 19న బోయిగూడ ఏరియాకు ఉదయం 10 గంటలకు దేవాయలం నుంచి బయలుదేరి 20న రాత్రి 7 గంటల వరకు చేరుకుంటుంది. అనంతరం 21న అమ్మవారికి బోనాలు, 22న రంగం వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గోల్కొండ బోనాలను ఘనంగా జరుపుకోవాలి

ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

మెహిదీపట్నం, జూలై 5 : తెలంగాణ ఆషాఢ మాసం బోనాలను గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయంలో నెల రోజుల పాటు ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నగర పోలీస్ కమిషనర్ కొత్త కోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నగర సీపీ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కమిషనర్ విశ్వప్రసాద్, ఆర్డీవో మహిపాల్, దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఏసీపీలు సయ్యద్ ఫయాజ్, ధనలక్షితో కలిసి లంగర్‌హౌస్ చౌరస్తా, గోల్కొండ కోటలో పర్యటించి బోనాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశాలతో బోనాల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా చేపట్టడానికి పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అంతకు ముందు నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బోనాలకు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని, సీసీ కెమెరాలతో శాంతి, భద్రతలను పర్యవేక్షిస్తామన్నారు. భక్తులకు గోల్కొండ చుట్టు పక్కల పార్కింగ్ ప్రాంతాల నుంచి సెట్విన్ బస్సుల్లో ఉచితంగా కోటకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ అష్పాక్ అహ్మద్, ఆలయ సలహాదారు సిరుగుమల్ల రాజు వస్తాద్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. గోల్కొండ బోనాలకు వచ్చే భక్తులకు జలమండలి తాగునీటి వసతి కల్పించింది. కోట ప్రారంభంలో ఉన్న మెట్ల దగ్గరి నుంచి మొదలుకుని బోనాలు జరిగే ప్రాంతం వరకు తాగునీటి పాయింట్లు ఏర్పాటు చేశారు.

గోల్కొండ కోటలో మెట్ల పూజ

ఆదివారం ఆషాఢ మాసం బోనాలు ప్రారంభం కానుండటంతో శుక్రవారం అమావాస్య కావడంతో నగరంలోని పలు ప్రాంతాల నుంచి మహిళలు గోల్కొండ కోటకు వచ్చి మెట్ల పూజలు చేశారు. ఈ సందర్భంగా కోట ప్రారంభం నుంచి అమ్మవారి గుడి వరకు ఉన్న మెట్లకు బొట్లు పెడుతూ, హారతి ఇచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు.

బొగ్గు గనుల వేలంను రద్దు చేయాలి

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మేడ్చల్, జూలై5(నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలంను రద్దు చేయాలని, సింగరేణికి బొగ్గు బ్లాక్‌లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పదవ విడతలో 61 బొగ్గు బావులను వేలం వేస్తుందని, అందులో మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలం వేస్తుందని ఆరోపించారు. మూడు వేల కోట్ల లాభాలతో నడుస్తున్న సింగరేణిని దెబ్బతీసేలా బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నా కార్యక్రమంలో నాయకులు రవి, అశోక్, ఎం.వినోద, రాథోడ్ సంతోష్ , జి. శ్రీనివాసులు, జె.రాజశేఖర్, శ్రీనివాస్, గణేశ్, నఫీయా, శారద, చంద్రశేఖర్, కృష్ణానాయక్, లింగస్వామి, ఉన్ని కృష్ణ, కిష్టప్ప, శ్రీమన్నారాయణ, ఎన్.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, జూలై 5 (నమస్తే తెలంగాణ): వీధి దీపాల నిర్వహణలో అశ్రద్ధ వహించవద్దని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో ఈఈ ఎస్ఎల్ ప్రతినిధులు, అడిషనల్ కమిషనర్‌లతో వీధి దీపాల నిర్వహణపై సమీక్షించారు. రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగకపోతే ప్రజలు ఇబ్బందులు పడతారని, వెంటనే స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షకాలం నేపథ్యంలో వెంటనే మరమ్మతులు చేసి చీకటి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన ప్రకారంగా బఫర్ స్టాక్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏజెన్సీని ఆదేశించారు. అగ్రిమెంట్ ప్రకారం అన్ని సమకూర్చుకోవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. బోనాల సందర్భంగా దేవాలయాల వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా అదనపు వీధి దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో ఈఈఎస్ఎల్ ప్రతినిధులు, అడిషనల్ కమిషనర్ ఎల్లకిసిటీ సత్యనారాయణ, ఈఈ మమత, ఇన్‌చార్జి ఎస్ఈ సంతోష్ , ఎస్ఈ దివ్య తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్..

చంపాపేట / వనస్థలిపురం, జూలై 5 : వనస్థలిపురంలోని సుష్మా థియేటర్ వెనుక ఉన్న స్కేటింగ్ మైదానం, వనస్థలిపురం ఫేజ్- 4 కాలనీలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పరిశీలించారు. చంపాపేట డివిజన్ పరిధిలోని గాంధీ బొమ్మ సమీపంలో ఉన్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాలు, మోడల్ మార్కెట్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మోడల్ మార్కెట్‌లో ఖాళీగా ఉన్న షాపులను గుర్తించి వాటిని వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు.

దోమల నివారణ పై పాఠశాలల్లో అవగాహన

సిటీబ్యూరో, జూలై 5 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ వ్యాప్తంగా దోమల ద్వారా వచ్చే వ్యాధులను పూర్తి స్థాయిలో అరికట్టడంలో ఎంటమాలజీ విభాగం అన్ని చర్యలు తీసుకుంటున్నదని చీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాల మేరకు దోమల నివారణకు శుక్రవారం పలు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా దోమలు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో దోమలు వృద్ధి చెందకుండా ముఖ్యంగా అన్ని పాఠశాలల్లో ప్రతి శుక్రవారం ప్రార్థన సమయంలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం ఫ్రైడే అనే నినాదంతో అన్ని పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన ఆరోగ్య సదస్సు నిర్వహించారు.150 పాఠశాలల్లో సుమారు 30వేల మంది విద్యార్థులకు ఆయా డివిజన్‌ల అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించినట్లు డాక్టర్ రాంబాబు తెలిపారు.



ఈ నెల 13 నుంచి హైలైఫ్ ఎగ్జిబిషన్

జూబ్లీహిల్స్, జూలై 5 : నగరంలోని హైటెక్ సిటీ హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఈనెల 13 నుంచి 15 వరకు హైలైఫ్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని అతిపెద్ద ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌లలో పేరున్న ఈ ప్రదర్శనలో కళాత్మక సేకరణలు కనువిందు చేయనున్నాయి. ఇందులో క్రియేటివ్, ఫ్యాషన్ వేర్ అండ్ లైఫ్ స్టైల్ వేర్, వెడ్డింగ్ వేర్, డిజైనర్ వేర్, ఆక్ససరీస్, ఆకట్టుకునే జ్యువెలరీ సేకరణలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు.

కబ్జాలపై ఉక్కుపాదం

బాలాపూర్ సర్వే నం.74లో ఆక్రమణల కూల్చివేత

కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమి స్వాధీనం

సూచిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

నమస్తే ఎఫెక్ట్

బడంగ్‌పేట, జూలై 5 : ఎట్టకేలకు కబ్జాదారుల చెర నుంచి ప్రభుత్వ భూమిని కాపాడారు. బాలాపూర్ పరిధిలోని కోట్ల విలువైన రెండెకరాల ప్రభుత్వ భూమిని కాజేయాలని పథకం వేశారు. అనుకున్నదే తడువుగా భూమి చుట్టు ప్రహరిని నిర్మించడానికి పనులు మొదలు పెట్టారు. గమనించిన స్థానికులు బాలాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నం.74లో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నదని తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ భూమిని కాజేయడానికి కబ్జాదారులు స్థానిక పెద్దల సహకారం తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు నమస్తే తెలంగాణ పత్రికను ఆశ్రయించారు.'ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం' అనే పేరున కథనం ప్రచురితమైంది. దీంతో కార్పొరేటర్ మహేశ్వరి జైహింద్, పలు దళిత సంఘాల నాయకులు, స్థానికులు పేపర